# గడువు తీరినా కొనసాగుతున్న విక్రయాలు



- ఎక్స్‌పైరి డేట్ దాటినా.. యథేచ్ఛగా శీతల పానీయాలు, తినుబండారాల అమ్మకాలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం..
- లక్షెట్టిపేటలో కూల్ డ్రింక్స్ తాగిన చిన్నారులకు అస్వస్థత
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల(లక్షెట్టిపేట) :**

కిరాణా షాపులు, ఇతర తినుబండారాల విక్రయ షాపుల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు వ్యాపారులు. ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని ఓ కిరాణ దుకాణంలో కాలం చెల్లిన శీతల పానీయాల విక్రయం వెలుగులోకి వచ్చింది.

పట్టణంలోని ప్రముఖ గోదావరి కిరాణ షాప్‌లో ఓ వ్యక్తి మజా కొనుగోలు చేసి చిన్నారులకు తాగించాడు. అది తాగిన పది నిమిషాల వ్యవధిలోనే పిల్లలు వాంతులు చేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు మజా బాటిల్ చూసేసరికి గడువు తీరిన తేదీ కనిపించడంతో ఒక్కసారిగా ఖంగు తిన్నారు. షాప్ యజమానిని నిలదీయడంతో దాటవేసే ప్రయత్నం చేశాడు. దానితో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం తో ఎస్సై పూర్తి వివరాలు తెలుసుకొని వినియోగదారులకి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పట్టణంలో ఇలాంటి ఔట్ డేటెడ్ కూల్ డ్రింక్‌లను కిరాణా షాప్‌లలో చౌక ధరలకు వేస్తున్నారు. కానీ కస్టమర్ల వద్ద మాత్రం ఎమ్మార్పీపై పై 5 రూ. అదనంగా కూలింగ్ చార్జీ అని ముక్కు పిండి మరీ వసూలు చేస్తుండటం గమనార్హం. ఈ డ్రింక్స్‌ని చిన్న పిల్లలు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. కాలం చెల్లినా కూడా వీటినే మార్కెట్‌లో విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శీతలపానీయాలైన మాజా, పల్పీ ఆరంజ్, అప్పి, ఫిజ్ వంటి డ్రింక్స్‌ని కాలం చెల్లిన తర్వాత కూడా కిరాణ దుకాణాల్లో వేసి డీలర్లు, యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. కానీ ఇదంతా సంబంధిత అధికారులకు కనిపించడం లేదని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔట్ డేటెడ్ డ్రింక్స్‌ని ఒక కాటన్‌కి బదులు రెండు కాటన్లు వేస్తూ డీలర్లు, కిరాణా షాపు యజమానులతో చేతులు కలిపి కస్టమర్‌లని ఆర్థికంగా దోచుకోడంతో పాటు ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. సంబంధిత అధికారులు దాడులు నిర్వహించి కాలం చెల్లిన తినుండారాలు, శీతల పానీయాలను మార్కెట్‌లోకి రాకుండా అడ్డుకోవాలని, గడువు దాటిన వాటిని మార్కెట్లో విక్రయించే వారి డీలర్ షిప్‌ని రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# ఆధ్యాత్మిక ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ విప్



**శెనార్తి మీడియా, వేములవాడ :**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలు ఆధ్యాత్మిక ఉత్సవాలకు హాజరయ్యారు. వేములవాడ అర్బన్ మండలం కొడుముంజలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాకు హాజయ్యారు. సంకేపల్లిలో చౌడలమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఉత్సవ కమిటీల బాధ్యులు ప్రభుత్వ విప్‌ను సత్కరించారు. పెద్దమ్మ తల్లి, చౌడలమ్మ దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని విప్ ఆకాంక్షించారు.

# మానసా దేవి వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలోని స్వయంభూ మానసా దేవి అమ్మవారి సప్తమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, నరసయ్య, దేశారాజ్ అనిల్, రాపోలు నవీన్, కళ్లెం మల్లారెడ్డి, అడ్వకేట్ మహేందర్ పాల్గొన్నారు.




## యువతి ఆత్మహత్య

**కరీంనగర్ :** : ఉద్యోగం రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇల్లందకుంట ప్రొబేషనరీ ఎస్సై దీపక్ కుమార్ కథనం ప్రకారం.. శ్రీరాములపల్లికి చెందిన మేకల సారయ్య చిన్న కూతురు కవిత (30) ఎంఎస్సీ బీఈడీ పూర్తి చేసింది. ఉద్యోగం రాకపోవటంతో గురువారం పురుగు మందు తాగగా జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

# మాట మార్చిన ప్రైవేట్ సీడ్ కంపెనీ




**శెనార్తి మీడియా, కరీంనగర్ ప్రతినిధి :**

అడుగడుగునా రైతు మోసానికి గురవుతూనే ఉన్నాడు. పండించిన పంటను విక్రయిద్దామంటే దళారీ తూకంలో కోతతో, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుందామంటే 40 కిలోల బస్తాకు తాలు, తప్ప పేరిట రెండు నుంచి మూడు కిలోలు అధనంగా జోకుతూ రైతన్నలను నట్టేట ముంచుతుండ్రు. ప్రైవేటు సీడ్ కంపనీలు మేమేం తక్కువ కాదంటూ రైతులకు మొదట చెప్పిన విధంగా డబ్బులివ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్న వైనం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో వెలుగు చూసింది.

**ప్రైవేట్ సీడ్ కంపెనీ మోసం...**

ప్రైవేట్ సీడ్ కంపెనీ మోసపూరిత వ్యవహారంతో రైతులు న్యాయం కోసం గురు వారం రోడ్డెక్కిన సంఘటన ఓదెల మండలం కనగర్తిలో చోటు చేసుకుంది. ఈ ఏడు వానా కాలం(ఖరీఫ్ సీజన్) లో ఐటీసీ అనే ప్రైవేటు సీడ్ కంపెనీ రైతులకు సీడ్ ఇచ్చి పండిన పంటను తామే కొనుగోలు చేస్తామంటూ కంపెనీ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్ల ద్వారా వ్యాపారం ప్రారంభించింది. ఈ మేరకు రైతులతో సదరు కంపెనీతో ఒప్పందం చేయించుకొని ఈ కంపెనీ విత్తనాలు సుమారు 60 ఎకరాల్లో 22 మంది రైతులకు ఇచ్చి సాగు చేయించింది. కంపెనీ ప్రతినిధులు ఎకరాకు 10 క్వింటాళ్ల ధాన్యం వస్తుందని, ఈ ధాన్యానికి క్వింటాలుకు రూ. 11 వేలు చెల్లించి తామే తీసుకుంటామని రైతులను మెప్పించింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లే రావడంతో మోసపోయినట్లు గుర్తించిన రైతులు కంపెనీ ఆర్గనైజర్ ను ఆశ్రయించారు.

- మా కంపెనీ విత్తనాలు వేస్తే లాభాలు వస్తాయంటూ ప్రచారం...
- రైతులతో నోటిమాట ఒప్పందా లు
- దిగుబడి రాకపోవడంతో ప్లేట్ ఫిరాయించిన సీడ్ కంపెనీ నిర్వాహకులు...
- మిగతా డబ్బుల కోసం రైతుల ఆందోళన
- పట్టించుకోకపోవడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**వంటావార్పుతో రైతుల నిరసన.. వ్యాన్ ముట్టడి...**

జరిగిన నష్టానికి సంబంధించి మొత్తం డబ్బులను ఇప్పించాలని రైతులు కంపనీ ఆర్గనైజర్ ను కోరగా ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆగ్రహానికి గురైన రైతులు న్యాయం కోసం గురువారం (ఈ నెల 8న) ఆ కంపెనీ వ్యాన్ ను ముట్టడించారు. రోడ్డుపైనే వంటా, వార్పు నిర్వహించి నిరసనకు దిగారు. 22 మంది రైతులకు సుమారు రూ.36 లక్షల విలువైన పంటను కంపెనీకి సరఫరా చేసినప్పటికీ, ఇప్పటి వరకు కేవలం రూ. 22 లక్షలే చెల్లించారని వాపోయారు. మిగిలిన రూ. 14 లక్షల గురించి అడిగితే అధికారులు తప్పించుకుంటున్నారని, దీనితో కంపెనీ వ్యాన్‌ను నిలిపివేసి న్యాయం కోసం ఎదురుచూస్తున్నామని బోరున విలపించారు.

**న్యాయం కోసం ఠాణా మెట్లు ఎక్కిన రైతులు..**

ప్రైవేటు సీడ్ కంపెనీలు తమను మోసం చేయాలని చూస్తున్నాయని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు శుక్రవారం కనగర్తి పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి సీడ్ కంపెనీపై విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. “పంట పెట్టి అప్పుల పాలయ్యాం.. ఇప్పుడు మా డబ్బుల కోసం పడుతున్న బాధలు ఎవరి కంటబడటం..?” లేదంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**మా దృష్టికి రాలేదు:**

మా క్లస్టర్ పరిధిలో కేవలం ఆరు సీడ్ కంపెనీలకు మాత్రమే అనుమతి ఉంది. దాదాపు 800 ఎకరాల్లో రైతులు మేల్, ఫీమేల్ సీడ్ సాగు చేశారు. తాము సీడ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు కానీ, సీడ్ వేసినట్లు రైతులు మా దృష్టికి తీసుకు రాలేదు. రైతులు పంట సాగు చేసే సమయంలో సంబంధిత కంపెనీతో ఒప్పంద పత్రాలు రాయించుకోవాలని సూచిస్తున్నాం.

**అనిల్, ఏఈఓ కనగర్తి**

**చెప్పింది ఒకటి.. అమలు చేసింది మరోటి...**



కంపెనీ వాళ్లు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్న మాట మీదే తాము పంటను వేసినం. క్వింటాలకు రూ. 11 వేలు చెల్లిస్తామన్నారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు లేదా వాతావరణం అనుకూలించకపోతే ఒక్క ఎకరానికి రూ. 60 వేలు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు కేవలం 2–3 క్వింటాళ్లు మాత్రమే పంట వచ్చింది, నష్టం జరిగిన పంటకు తమకు న్యాయం చేయకుండా ఎగబెట్టి వెళ్లిపోతుండ్రు. మొదట ఒకటి చెప్పి.. తర్వాత ప్లేటు ఫిరాయిస్తుండ్రు. మాకు న్యాయం చేయాలి.

**– తాటిపెల్లి శ్రీనివాస్ రైతు , కనగర్తి**

**సీడ్ కంపెనీ మోసం చేయాలని చూస్తుంది:**



సీడ్ కంపెనీలు, ఏజెంట్ల చేతి వాటంతో మాకు అన్యాయం జరిగింది. ఆర్గనైజర్లు ముందో మాట చెప్పి తర్వాత మాట తప్పుతుండ్రు. దీనితో లక్షల్లో నష్టపోవాల్సి వస్తోంది. పాత ఏజెంట్ పోయి కొత్త ఏజెంట్ వచ్చిండు. ఆయన నాకు సం బంధం లేదంటుండు. అధికారులు మాకు కంపనీ వల్ల జరిగిన నష్ట పరిహారాన్ని ఇప్పించి న్యాయం చేయాలి. వరంగల్ లోని ఐ టి సి కంపెనీకి శనివారం రోజున మా రైతులను చేర్చలకు రమ్మన్నారు . ఒక్క వేళ అక్కడా మాకు న్యాయం జరగకుంటే కంపెనీ ముందే నిరసనకు సైతం దిగుతాం

**పెద్దిరెడ్డి శ్రీనివాస్ రైతు , కనగర్తి**

# 20న కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె జరుగుతుందని దీని జయప్రదం చేసేందుకు జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కటిక రెడ్డి బుచ్చ న్న యాదవ్ శుక్రవారం పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని బైపాస్ రోడ్‌లో గల సిమెంట్ గోదాం వద్ద సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శుక్రవారం హమాలీ కార్మికులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయినా శ్రమిస్తున్న ప్రజల జీవితాలు , జీవన ఉపాధిపై తన కార్పొరేట్ కుతంత్రాలు అమలు చేయాలని ప్రయత్నిస్తుందని దీనివల్ల దేశంలో పేదరికం, ఆకలి, పోషకాహార లోపం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 44 లేబర్ కోడ్లను సంస్కరించి కార్మికుల పని భారాన్ని పెంచారని, 8 గంటలు ఉన్న పని గంటలకు 12 గంటలుగా మార్చారని దీనిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేబర్ కోడులు అనేవి శ్రామిక ప్రజలపై బానిసత్వం విధించే బ్లూ ప్రింట్ లాంటివని సంఘంలోని కార్మికులకు సంబంధించిన అన్ని హక్కులు కార్మికుల నుండి లాక్కుంటున్నారని పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత పని పరిస్థితులకు సంబంధించిన అన్ని ప్రాథమిక హక్కులను తీవ్రమైన సవాలుగా పరిగణించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సిమెంట్ గోదాం హమాలీ అధ్యక్షులు జంగం తిరుపతి ఉపాధ్యక్షులు బాగోతం వీరయ్య, నాయకులు నన్నవేని శ్రీనివాస్, ననవేని కొమరయ్య, పల్లెర్ల రాములు గౌడ్, ముత్యాల శ్రీనివాస్, దానవేని కొమరయ్య, ఉప్పారం శ్రీనివాస్, జక్కుల ఐలయ్య, దొంగల శ్రీనివాస్, బోయిని ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.